క్లుప్తంగా

రాంగ్ పార్కింగ్‌కు అడ్డుకట్ట



చంద్రంపాలెం వద్ద రాంగ్ పార్కింగ్ చేసిన వాహనానికి లాక్ చేస్తున్న పోలీసులు

మధురవాడ : ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా రాంగ్ పార్కింగ్ నివారణకు పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. శనివారం మధురవాడ మార్కెట్, అప్‌బ్రిడ్జి, హైవే, చంద్రంపాలెం, ఉడా కాలనీ, కారు షెడ్ తదితర ప్రాంతాల్లో రోడ్ల మీద, ఇతర చోట్ల రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు లాక్‌లు వేసి జరిమానాలు విధించారు.

రామానాయుడు స్టూడియోలో షూటింగ్ సందడి



పోలీస్ స్టేషన్‌లో చిత్రీకరిస్తున్న ఓ సన్నివేశం

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలోని రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో శనివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సూపర్ హిట్ ఫిలిమ్స్ బ్యానర్‌పై కల్కి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించి ఇక్కడి పోలీస్ స్టేషన్‌లో పలు సన్నివేశాలు చిత్రీకరించారు. నేటి కాలంలో యువత సెల్‌ఫోన్ మాయలో పడి ఎలా పెడదోవ పడుతున్నారో తెలియజేసే కథాంశంతో సినిమా చిత్రీకరిస్తున్నామని, నటీనటులుగా శంకర్, సరిత నటిస్తున్నారని దర్శకుడు కల్కి తెలిపారు.

రేపటి నుంచి శ్రావణ మాస పూజలు



కొమ్మాదిలోని అష్టలక్ష్మి ఆలయం

కొమ్మాది : స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో సోమవారం నుంచి శ్రావణ మాస పూజలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు సత్యనారాయణ, రమాదేవి తెలిపారు. తొలి రోజు సోమవారం కలశ స్థాపన, శుక్రవారం గరుడ పంచమి, శనివారం సుదర్శన అభిషేకం, రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, వజ్రకవచధారణ, 18న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి నిజరూప దర్శనం, 19న శ్రావణ పౌర్ణమి, అభిషేకం, 27న మంగళవారం వైష్ణవ కృష్ణాష్టమి, 30న 108 పట్టుచీరలతో వస్త్రార్చన నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు.

డస్ట్‌బిన్లు మాయం



ఇటీవల డస్ట్‌బిన్ ఏర్పాటు చేసిన చోట ఖాళీగా ఉన్న దృశ్యం

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ బీచ్ రోడ్డు ఐటీ జంక్షన్ వెంబడి నూతనంగా ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు మాయమైపోతున్నాయి. ఇటీవల జీవీఎంసీ అధికారులు ఈ రోడ్డుకు ఇరువైపులా స్టీల్ డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజుల్లోనే ఒక్కొక్కటీ మాయమైపోతున్నాయి. కావాలనే ఎవరో అపహరించుకుపోతున్నారని, వీటిపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



క్రీడాకారిణికి స్పోర్ట్స్ కిట్, నగదు సాయం అందిస్తున్న ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు



తగరపువలస గ్రంథాలయానికి పుస్తకాలు అందిస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు



ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు చిట్టివలస శ్మశానవాటికలో నిర్మించిన షెల్టర్

ఆత్మీయ సేవా బంధం

- అభాగ్యులకు అండగా ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు



ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యుని జ్ఞాపకార్థం మొక్క నాటుతున్న సభ్యులు



ఎస్ఎంఎంఎస్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు డీఈవో చంద్రకళ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందిస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు

తగరపువలస : చిట్టివలసకు చెందిన 50 మంది స్నేహితులు ఫ్రెండ్స్ ఫౌండేషన్ పేరుతో ఏటా సేవాకార్యక్రమాల ద్వారా అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. సభ్యులు నెలకు రూ.100 చందాలతో నిధులు పోగుచేసుకుని పేదలకు బియ్యం, దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. ప్రతి నెల సమావేశమై ఆ నెలలో చేయాల్సిన సేవలపై చర్చించుకుంటారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థతో కలిసి పేద క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, పెద్ద దిక్కు చనిపోయిన ఇంటి సభ్యులను ఆదుకోవడం వంటి కార్యక్రమాలు నిత్యం చేస్తుంటారు. కోవిడ్ కాలంలో వలస కార్మికులకు, భీమిలి మండలంలోని మురికివాడలలో ప్రజలకు నిత్యం ఆహార ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు, బియ్యం వంటివి పంపిణీ చేసి ఆదుకున్నారు. ఇటీవల చిట్టివలస శ్మశానవాటికలో రూ.2 లక్షలతో షెల్టర్ నిర్మించి అభినందనలు అందుకున్నారు.

విద్యా కాంతులు వెదజల్లుతూ...

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు కొండపేటకు చెందిన గంటాన మోహనరావు నగరంలోని దండుబజారు జీవీఎంసీ ఎంవీడీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన 38 ఏళ్లుగా ఉపాధ్యాయవృత్తితో పాటు సంఘసేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. భీమిలి నియోజకవర్గంలోని తోటి ఉపాధ్యాయ స్నేహితుల ద్వారా ఫ్రెండ్స్ ఇంగ్లిషు క్లబ్ స్థాపించి ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 వరకు విద్యార్థులు, నిరుద్యోగులను పోటీ పరీక్షలకు తీర్చిదిద్దుతున్నారు. అలాగే స్నేహ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిరుపేద నిరుద్యోగులకు డ్రైవింగ్, ప్లంబింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధికి మార్గం చూపుతున్నారు. ఇప్పటి వరకు 600కు పైగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

అందరికీ కృతజ్ఞతలు



ఇప్పటి వరకు ప్రోత్సహించిన తోటి ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు. పేద విద్యార్థులకు ఉచిత పోటీ పరీక్షలతో పాటు వైద్య శిబిరాలు, న్యాయ సదస్సులు ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్నా.

–గంటాన మోహనరావు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు

తల్లి పాలే బిడ్డకు అమృతతుల్యం



బంగ్లామెట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



తల్లిపాల వారోత్సవాల లోగో వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు



చిప్పాడలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీలు

మధురవాడ : పిల్లల పండంటి ఆరోగ్యానికి తల్లి పాలు అమృతతుల్యంలా పనిచేస్తాయని వాంబే కాలనీ యూపీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవల్లిక సూచించారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో తల్లి పాల వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, పువ్వులు, వివిధ రాకల వస్తువులతో సుందరంగా తల్లిపాల వారోత్సవాల లోగో ఏర్పాటు చేశారు. తల్లులు, బాలింతలకు తల్లిపాలు, ఇతర ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఇవ్వకపోతే ఎదురయ్యే అనర్థాలను ఆమె వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోనే ముర్రు పాలు తాగించాలని సూచించారు. ఐసీడీఎస్ మధురవాడ సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.లక్ష్మి మాట్లాడుతూ 6 నెలల వరకు తల్లిపాలు తాగించడం ఎంతో శ్రేయస్కరమన్నారు. తర్వాత పాలుతోపాటు అనుబంధ ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హేమలత, ఇందిరమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాగా తల్లిపాలు

తగరపువలస : తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలా పని చేస్తాయని ఐసీడీఎస్ భీమిలి సూపర్‌వైజర్ కె.ప్రమీలారాణి సూచించారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట వెంపాడ వారి వీధిలో అంగన్‌వాడీ నిర్వాహకురాలు కె.మేరమ్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బిడ్డ జన్మించిన గంటలోగా తల్లిపాలు తాగించాలని సూచించారు. 6 నెలల వరకు తల్లిపాలు తప్ప ఇతర ద్రవ పదార్థాలు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ స్వాతి పాల్గొన్నారు. భీమిలి మండలం చిప్పాడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పంచాయతీ కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ తల్లిపాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో పి.శ్యామ్‌సుందరరావు, అంగన్‌వాడీ కార్యకర్త సీత, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆదివారం కాలేజీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: జూనియర్ కాలేజీల్లో ఆదివారం తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారామ్ తెలిపారు. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేజీలు తెరువకూడదన్నారు. నగరంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. ఈ ఆదివారం బాలల హక్కుల కమిషన్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం, అదే విధంగా రెండో శనివారం విద్యార్థులను కాలేజీలకు పిలిపించినట్లయితే, అలాంటి కాలేజీల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. సెలవు రోజైన ఆదివారం కాలేజీలు నిర్వహించడానికి వీల్లేదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.మురళీధర్ హెచ్చరించారు.

వుడా కాలనీలో మరో భూ వివాదం



భూమి కొనుగోలు చేశానని బోర్డు ఏర్పాటు చేసిన వ్యక్తితో మాట్లాడుతున్న ట్రస్ట్ సభ్యులు



వివాదానికి కారణమైన భూమి ఇదే

- మళ్లీ రాజుకున్న రామలింగేశ్వర ట్రస్ట్ భూ వివాదం

మధురవాడ : విశాఖ రూరల్ మండలం మధురవాడలో మళ్లీ భూ వివాదాలు రాజుకుంటున్నాయి. ఎక్కడైనా చిన్న ఖాళీ, ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కొందరు పాగాకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు మిథిలాపురి వుడా కాలనీలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆనుకుని ఉన్న రామలింగేశ్వర ట్రస్ట్ భూమి మళ్లీ వివాదంలోకి వచ్చింది. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్లు 286/పి, 300పి లలో సుమారు 1300 గజాల స్థలం ఉంది. ఇది ఖాళీగా ఉండడంతో కొన్నేళ్ల క్రితం తమదని కొందరు వ్యక్తులు వచ్చారు. స్థానిక ట్రస్ట్ సభ్యులు సంయుక్తంగా అడ్డుకోవడంతో వెనుదిరిగారు. తర్వాత ఇందులో సదరు ట్రస్ట్ సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ... ఈ భూమి ట్రస్ట్‌కి చెందుతుందని బోర్డును ఏర్పాటు చేశారు. ఇప్పుడు మరో వ్యక్తి వచ్చి ఈ భూమిని తాము కొనుగోలు చేశామని, కోర్టు ఆర్డర్ కూడా ఉందంటూ రామలింగేశ్వర ట్రస్ట్ ఏర్పాటు చేసిన బోర్డును తీసేసి తన బోర్డు ఏర్పాటు చేశారు. పైగా దీనిని శుభ్రం చేసి పాక వేయడంతోపాటు ఫెన్సింగ్ వేయడానికి సిద్ధమయ్యారు. దీంతో స్థానిక ట్రస్ట్ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. జీవీఎంసీ, రెవెన్యూ, ఉడా అధికారులు వచ్చి సర్వే చేసి వెళ్లారు. వివరాలు మాత్రం గోప్యంగా ఉంచారు. తహసీల్దార్, ఆర్ఐలను వివరణ కోరే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

దొంగతనాలపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న క్రైం డీసీపీ పల్లా వెంకటరత్నం

పద్మనాభం : దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్రైం డీసీపీ పల్లా వెంకటరత్నం సూచించారు. మండలంలోని మద్ది గ్రామంలోని కల్యాణ మండపంలో శనివారం దొంగతనాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యప్రదేశ్, బీహార్, ముంబయి, కలకత్తా వంటి ఇతర ప్రాంతాల నుంచి దొంగలు మన రాష్ట్రంలోకి ప్రవేశించి మారణాయుధాలు, మత్తు పదార్థాలతో ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఇళ్ల ఇద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించవచ్చన్నారు. మూడు నెలల క్రితం పద్మనాభం మండలం ఐనాడ పంచాయతీ సత్యనారాయణపురంలో ఒక ఇంటిలోకి ఇతర రాష్ట్రానికి చెందిన దొంగలు చొరబడి దాడి చేశారని గుర్తు చేశారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలతోపాటు తోటి విద్యార్థుల భవిష్యత్‌నూ నాశనం చేస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజీలు నమ్మి సైబర్ మోసగాళ్లకు బలికావొద్దన్నారు. కార్యక్రమంలో సీఐ సీహెచ్.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసరావు

తగరపువలస : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల కోడ్‌ను అధికారులంతా పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల రూరల్ అధికారి, డీపీవో శ్రీనివాసరావు సూచించారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండకూడదన్నారు.

ఎన్నికల నోడల్ అధికారిగా పంచాయతీ విస్తరణ అధికారి రామారావును నియమించినట్టు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. ఇంటి పన్నులు విధిగా వసూలు చేయడంతోపాటు పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఈవో నీలం అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ మార్కెట్‌లో పాము కలకలం

తగరపువలస : స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో శనివారం ఒక పాము కలకలం సృష్టించింది. మార్కెట్‌కు వచ్చిన ఓ వినియోగదారుడు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం నుంచి దిగిన పాము మెయిన్ రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వారి పైనుంచి పరుగులు తీసింది. దీంతో అక్కడి వారు భయాందోళనకు గురయ్యారు. పలువురు కర్రలతో పామును కొట్టాలని ప్రయత్నించినా పక్కనే ఉన్న డ్రైనేజీలో నుంచి తప్పించుకుంది.

ఎన్నికల కోడ్ అమలు చేయమంతే..!

- మధురవాడలో ఎక్కడా తొలగించని టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు
- అధికార పార్టీ సేవలో తరిస్తున్న అధికారులు



మధురవాడ పీహెచ్‌సీ వద్ద ముసుగు లేని ఎన్టీఆర్ విగ్రహం



జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీ సచివాలయం వద్ద టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు



చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద ముసుగులు లేకుండా నాయకుల విగ్రహాలు

మధురవాడ : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది ఏమీ పట్టించుకోవడం లేదు. కోడ్ అమల్లోకి వచ్చి రెండు రోజులు కావస్తున్నా కనీసం సచివాలయాల వద్ద, ఇతర చోట్ల ఉన్న టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు తీయడం లేదు. పలుచోట్ల ఉన్న నాయకుల విగ్రహాలకు ముసుగులు కూడా వేయడం లేదు. గత ఎన్నికల్లో శిలాఫలకాలు కూడా కనిపించకుండా పేపర్లు అంటించేసి వర్షానికి చినిగిపోతే కానీ ఎవ్వరూ తియ్యలేదు. విగ్రహాలకు అయితే నిలువెత్తుగా గుడ్డ ముసుగులు వేసేశారు. కానీ ఇప్పుడు మాత్రం అవేమీ పట్టించుకోకుండా అధికార పక్షం సేవలో అధికారులు తరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ కాలనీ, శివశక్తి నగర్ రోడ్డు, గణేష్‌నగర్, నగరంపాలెం రోడ్డు, పీఎంపాలెం డబుల్ రోడ్డు తదితర చోట్ల ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. ఇక విగ్రహాలైతే అన్ని చోట్లా అలానే ఉన్నాయి. ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి కోడ్ అమలు చేసేలా స్థానిక అధికారులను ఆదేశించాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్‌హెచ్ కాలనీ రోడ్డు



గోతులమయమైన ఆర్‌హెచ్ కాలనీ రోడ్డు

పీఎం పాలెం : స్థానిక ప్రధాన రహదారి నుంచి ఆర్‌హెచ్ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గతుకులలో వర్షం నీరు చేరడంతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం స్థానిక కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి గోతులను పూడ్చి, రాకపోకలకు వీలుగా మార్చాలని కోరుతున్నారు.

మందుబాబులకు రూ.5 లక్షల జరిమానా

తగరపువలస : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 21 మందికి శనివారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య రూ.10వేలు వంతున జరిమానా విధించారు. అలాగే భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో 29 మందికి కూడా రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ రెండు స్టేషన్ల పరిధిలో 50 మంది మందుబాబులకు రూ.5 లక్షల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐలు తెలిపారు.

మధురవాడలో పార్కింగ్ జోన్ల ఏర్పాటు



పార్కింగ్ ప్రదేశం చదును చేసే పనులు పరిశీలిస్తున్న సీఐ కాంతారావు

మధురవాడ : నిత్యం రద్దీగా ఉండే మధురవాడ, కొమ్మాది జంక్షన్, రైతు బజార్ అప్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో ఎట్టకేలకు జీవీఎంసీ, పోలీసు అధికారులు వాహనాల పార్కింగ్ కోసం జోన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను శనివారం మధురవాడ పోలీసులు, జీవీఎంసీ అధికారులు పరిశీలించారు. రైతు బజార్, మ్యాక్స్ షాపింగ్ మాల్, అరోమా తదితర ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చని విశాఖ నార్త్ జోన్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కాంతారావు చెప్పారు. రైతు బజార్ వద్ద జాతీయ రహదారిని ఆనుకుని గణేష్ నగర్‌కి వెళ్లే రోడ్డు వద్ద గతంలో కారు వాషింగ్ సెంటర్ నడిపిన ప్రదేశంలో తాత్కాలిక పార్కింగ్ ప్రదేశంలో తుప్పల తొలగింపు, ఎత్తుపల్లాలు చదును చేసే పనులను ఆయన ఇతర సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాక్స్ షోరూం, అరోమా వద్ద కూడా వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ అధికారుల సహకారంతో మరిన్ని చర్యలు చేపడతామన్నారు. ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కి ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అంతా సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్.విజయ్‌కుమార్, పలువురు సిబ్బంది ఉన్నారు.

కుటుంబ సభ్యులకు యువతీయువకుడు అప్పగింత

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ శివారులో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువతీ యువకులను రైల్వే పోలీసులు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సింహాచలం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నార్త్ వైపున శివారున ఓ యువతి, యువకుడు ఉండడంతో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ గమనించి ఆరా తీశాడు. వారి పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశాడు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ ఎస్‌వీఎస్ రావు ఇరువురి వివరాలు సేకరించి మధురవాడ వాంబే కాలనీకి చెందిన వారని నిర్ధారించారు. యువకుడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. యువతి ఇంటర్ చదువుతోంది. ఇంట్లో చెప్పకుండా ఇక్కడికి వచ్చినట్లు తెలుసుకున్న పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వారు తప్పిపోయినట్లు పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో అప్పటికే ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పీఎంపాలెం పోలీసులు రైల్వే స్టేషన్‌కు రావడంతో వారి సమక్షంలో ఇద్దరికీ కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన వారితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో నలుగురు మునిగిపోతుండగా లైఫ్ గార్డ్స్ ప్రాణాలు కాపాడారు. విజయనగరం జిల్లా గరివిడి నుంచి ఓ కుటుంబానికి చెందిన 15 మంది సభ్యులు శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో తోలాడ గొల్లబాబు, కళ్యాణ కీర్తన, శోభ, కరిశెట్టి శాంతి కుమారి మునిగిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ సతీష్, నూకరాజు, ఎం.చందు, డి.కార్తీక్, ఎం.అమ్మోరు, కె.రాజు వీరిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు.